## ఈ-టిక్కెట్ల వ్యవహారంలో

# ఉలిక్కి పడిన రైల్వే బోర్డు

### విచారణకు ఆదేశం?

**రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే:** కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో సరైన టిక్కెట్లు లేకుండా ప్రయాణిస్తున్న 26 మందిని విజయవాడ డివిజన్ రైల్వే కమర్షియల్ అధికారులు శనివారం పట్టుకుని జరిమానా విధించిన సంఘటనతో రైల్వే బోర్డు ఉలిక్కిపడింది. వీరందరూ ఈ-టిక్కెటింగ్ రిజర్వేషన్ పొంది ప్రయాణించడం, అధికారుల పరిశీలనలో వాటిల్లో కేవలం ఆరుగురి టిక్కెట్లు మాత్రమే సరైనవని, మిగిలినవన్నీ నకిలీవేనని విచారణలో తేలడం విదితమే. ఈ ఈ-టిక్కెటింగ్ వ్యవహారం కారణంగా శనివారం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ చెన్నైలోనే 2 గంటలు ఆలస్యంగా బయలుదేరగా విజయవాడలో 50 నిముషాలు నిలిచిపోయింది. పరిస్థితిని సమీక్షించిన రైల్వే బోర్డు ఈ-టిక్కెటింగ్ రాకెట్‌పై విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఫలితంగానే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ వైజాగ్ చేరేలోగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే నిఘా విభాగం రంగంలోకి దిగి, వైజాగ్‌లో ఆ 26 మంది ప్రయాణికులను విచారించి, వారి వద్ద ఉన్న ఈ-టిక్కెట్ల జిరాక్స్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద ముఠా ఉందన్న అనుమానంతో దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు. దర్యాప్తు బాధ్యతను కేంద్ర దర్యాప్తు సంస్థకు లేదా రైల్వే నిఘా విభాగానికి అప్పగించవచ్చునని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.